సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 20 | అక్టోబర్ | 2025



బీసీ ఉద్యమం బలోపేతం

బీసీ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయనున్నట్లు బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. - 8లో▸



తల్లుల పోరాటం అందరికీ స్ఫూర్తి

- 8లో▸

మేడారం సమ్మక్క, సారలమ్మ పోరాటం అందరికీ స్ఫూర్తి అని దత్తగిరి పీఠాధిపతులు అవధూతగిరి, సిద్ధేశ్వరానందగిరి అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.8^0 /23.2^0

జిల్లాలో ఉదయం చలితోపాటు మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



రాహుల్ శర్మ

భూపాలపల్లి: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ శర్మ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దల పర్యవేక్షణలో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ దీపావళి ప్రతీ ఇంటా వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

'ఏఐటీయూసీ వైఫల్యాలతో అన్యాయం'

భూపాలపల్లి అర్బన్: మైనింగ్ స్టాఫ్‌కు కొంత కాలంగా జరుగుతున్న అన్యాయానికి కారణంగా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం వైఫల్యమేనని టీబీజీకేఎస్ సెంట్రల్ జాయింట్ సెక్రటరీ రత్నం అవినాష్, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జ్ చీకటి వంశీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘం మైనింగ్ స్టాఫ్ సమస్యల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తూ మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరపకుండా టీబీజీకేఎస్‌పై విషప్రచారం చేస్తూ కాలం గడుపుతోందని ఆరోపించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో జేఎంఈటీలకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు ఆలస్యం లేకుండా ఇప్పించినట్లు తెలిపారు.

మొరం దందాను అరికట్టాలి

చిట్యాల: మండలంలోని శాంతినగర్‌లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శాంతినగర్ గుట్టలలో కొంతమంది నాయకులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. మట్టిని తరలించకుండా అధికారులు చూడాలని అన్నారు. ఆయన వెంట నాయకులు రాము, తదితరులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం

కాటారం: గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొని వారి దగ్గర నుంచి 1.57 కేజీల గంజాయిని ఆదివారం పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టంపేట గ్రామానికి చెందిన సుతారి శ్రీకాంత్, కమలాపూర్ గ్రామానికి చెందిన సోహెల్, మద్దులపల్లికి చెందిన మేకల అజయ్ కాటారం మండలంలోని పోతుల్వాయి బ్రిడ్జి వద్ద గంజాయి సేవిస్తున్నారు. అటువైపుగా వెళ్తున్న ఎస్సై శ్రీనివాస్ అనుమానంతో వారిని ప్రశ్నించగా అజయ్ పారిపోయాడు. శ్రీకాంత్, సోహెల్‌ను విచారించగా గంజాయి సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద 1.57 కేజీల గంజాయి గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయితో పాటు ఒక మొబైల్ స్వాధీనపర్చుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీకాంత్, సోహెల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

టేకు దుంగల స్వాధీనం



ఏటూరునాగారం: ఏటూరునాగారం నుంచి వరంగల్ వైపు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారు జామున మండల పరిధిలోని చిన్నబోయినపల్లి సమీపంలో జినాన్ పింక్ అప్ వాహనంలో తొమ్మిది టేకు దుంగలను పట్టుకెళ్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఆ వాహనాన్ని అడ్డగించి తనిఖీ చేస్తుండగా డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో ఉన్న టేకు దుంగల విలువ రూ.4 లక్షల వరకు ఉంటుంది. ఈ దుంగలను ఏటూరునాగారం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నారాయణ, ఎఫ్‌బీఓ ఖాజామొద్దిన్, జ్యోతి, అనూష, బేస్ క్యాంప్ సిబ్బంది సాంబ, ప్రశాంత్, మహేశ్, నాగేంద్ర, డ్రైవర్ హరీశ్ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

ములుగు రూరల్: కల్లుగీత కార్మికులు హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం కల్లుగీత కార్మిక సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జెండాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలన్నారు.



బంతిపూల వనం

చిట్యాల మండల కేంద్రం నుంచి రామచంద్రాపూర్‌కు వెళ్లే దారిలో బంతిపూల తోట చూపరులను ఆకట్టుకుంటోంది. భూమికి పసుపు, ఎరుపు రంగు వేసినట్లు ఉండడంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులను కనువిందు చేస్తుంది. - చిట్యాల



విద్యుత్ కాంతుల్లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం

భూపాలపల్లి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి పట్టణం మంజూర్‌నగర్‌లోని కలెక్టర్ రాహుల్ శర్మ క్యాంపు కార్యాలయం విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. కార్యాలయం చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది.

కిక్కు రాలే..!

ఉమ్మడి జిల్లాలో తగ్గిన వైన్స్ దరఖాస్తుల ఆదాయం

- 294 షాపులకు 9,754 అర్జీలు, రూ.292 కోట్ల రెవెన్యూ
- టెండర్ల గడువు 23 వరకు పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి వరంగల్/కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైన్స్ దరఖాస్తుల ఆదాయం ఈసారి గణనీయంగా తగ్గింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి శనివారం అర్ధరాత్రి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించింది. దరఖాస్తులు, ఆదాయం రెండింతలు వస్తుందనుకున్న ప్రభుత్వ లక్ష్యం ఈసారి నెరవేరలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్స్‌కు 2023–25 టెండర్లలో 16,039 దరఖాస్తులతో 318 కోట్ల ఆదాయం వచ్చింది. 2025–27కు శనివారం చివరి తేదీగా మొదట ప్రకటించారు. రాత్రి 10 గంటల వరకు 9,754 దరఖాస్తులతో 292.4 కోట్ల ఆదాయం లభించింది. కాగా, గత టెండర్లతో పోల్చితే 6,285 దరఖాస్తులు, 28.16 కోట్ల ఆదాయం తగ్గింది. కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కడిపికొండ వైన్స్‌కు అత్యధికంగా 114 దరఖాస్తులు వచ్చాయి. భూపాలపల్లి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని మూడు వైన్స్‌లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే రావడం గమనార్హం. చివరి రోజు వరంగల్ అర్బన్‌లో 1,577, వరంగల్ రూరల్‌లో 910, జనగామలో 950, మహబూబాబాద్‌లో 735, భూపాలపల్లిలో 1,036 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల స్వీకరణ మూడు రోజులే..

వైన్స్ టెండర్ల గడువును ఈనెల 23 వరకు పొడిగిస్తూ శనివారం అర్ధరాత్రి ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ఐదు రోజులు పొడిగించినా ఆదివారం, సోమవారం దీపావళి సెలవులు ఉన్నాయి. కాగా, మూడు రోజులు మాత్రమే దరఖాస్తుల స్వీకరణకు సమయం ఉంది.

దరఖాస్తు ఫీజు పెంపుదలే కారణం..

వైన్స్ దరఖాస్తులకు నాన్ రీఫండబుల్‌గా గత టెండర్లలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. ఈసారి రూ.3 లక్షలకు ప్రభుత్వం పెంచింది. దీంతో దరఖాస్తులు చేసేందుకు మద్యం వ్యాపారులు ఈసారి పెద్దగా ముందుకురాలేదు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం మందకొడిగా ఉండడంతో స్థిరాస్తుల కొనుగోళ్ల వైపు ఎవరూ మొగ్గు చూపడం లేదు.రూ.3 లక్షల నాన్ రీఫండ్ ఫీజుతో దరఖాస్తు చేసే బదులు రెండున్నర తులాల బంగారం కొనుగోళ్లకు మధ్య తరగతి కుటుంబాల వారు ఆసక్తి కనబరిచారు.



శనివారం రాత్రి 10 గంటలకు దరఖాస్తు స్వీకరిస్తున్న కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్

జిల్లాల వారీగా 2023-25, 2025-27 సంవత్సరాల్లో దరఖాస్తులు, ఆదాయం వివరాలు

జిల్లా	వైన్స్	2023-25 దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)	2025-27 దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)
వరంగల్ అర్బన్	67	5,859	117	3,012	90.3
వరంగల్ రూరల్	57	2,938	58	1,826	54.7
జనగామ	50	2,492	49	1,587	47.6
మహబూబాబాద్	61	2,589	51	1,672	50 .1
భూపాలపల్లి	59	2,161	43	1,657	49.7

రూ.320.7 కోట్ల టార్గెట్..

2025–27 రెండేళ్ల కాలపరిమితితో వైన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 25న టెండర్ల ప్రక్రియ ప్రకటించింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల చివరి తేదీ తొలుత నిర్ణయించారు. కాగా, అక్టోబర్ 18 చివరి రోజు వరకు కేవలం 9,754 దరఖాస్తులు, రూ.292.2 కోట్ల ఆదాయం వచ్చింది. గత టెండర్ల రూ. 320.7 కోట్ల ఆదాయ టార్గెట్‌ను దాటేందుకు ఈనెల 23 చివరి తేదీగా మరో ఐదు రోజుల అవకాశం కల్పించింది. ఈనెల 27వ తేదీన లక్కీడ్రా తీయనున్నారు. కాగా, రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల నాన్ రీఫండబుల్ ఫీజుతో దరఖాస్తుతో పాటు ఆదాయం పెరుగుతుందని వేసిన అంచనాలు తలకిందులయ్యాయి. దీంతో ఖజానాకు ఆదాయం కిక్కు పొందేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది.

వనదేవతలకు భక్తుల మొక్కులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో పుట్టువెంట్రుకలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు షెడ్లలో విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ప్రాచీన వైద్యంతో మెరుగైన జీవనం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ప్రాచీన వైద్య పద్ధతుల ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సుభాష్ కాలనీలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధన్వంతరి వైద్య నారాయణ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై వైద్య నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ములుగు రూరల్: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేశ్ సూచించారు. మండల పరిధిలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడారు.



ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..

భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ముందు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పశువులు ఇప్పటికే విద్యుదాఘాతానికి గురయ్యాయి. రోడ్డుపై నిత్యం ప్రయాణికులతో పాటు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి రోజూ వందలాది మంది విద్యార్థులు వస్తుంటారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు పెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. - భూపాలపల్లి రూరల్

నేడు దీపావళి

- రేపు కేదారేశ్వర నోములు
- పండుగకు ముస్తాబైన గ్రామాలు



భూపాలపల్లి పట్టణంలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న యువతి



భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా నేడు (సోమవారం) ఉదయం దీపావళి, బోగి పండుగ హారతులు నిర్వహించి రేపు (మంగళవారం) సాయంత్రం ధనలక్ష్మి పూజలు చేపట్టుకోనున్నారు. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మొదటి రోజున వ్రతాలు, నోములు చేసుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వెలుగుల పండుగ దీపావళి ధనలక్ష్మి పూజలు, కేదారేశ్వర నోముల కోసం సుదూర ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులంతా సొంత ఊళ్లకు చేరుకున్నారు. పట్టణంతో పాటు పల్లె లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పండుగ శోభ సంతరించుకుంది.

అందాల ప్రమిదలు

దీపావళి పండుగలో మట్టి ప్రమిదలకు ఎంతో విశిష్టత ఉంది. దీపాల కాంతుల్లో గృహాలు, ఆలయాలు మరింత శోభను సంతరించుకుంటాయి. వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా తయారు చేసిన ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. రాజస్థాన్, కేరళ, ఢిల్లీ ప్రాంతాల్లో తయారైన వాటితో పాటు స్థానికంగా తయారుచేసిన ప్రమిదలను విక్రయిస్తున్నారు. డజన్ల చొప్పున విక్రయాలు చేపడుతున్నారు.

బాణసంచాకు పెరిగిన ధరలు

గతేడాది కంటే ఈ ఏడాది మరింతగా ధరలు పుంజుకున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. చిచ్చుబుడ్డీలు రూ.30నుంచి రూ.800 వరకు, కాకరపువ్వొత్తుల బాక్స్ రూ.250 నుంచి రూ.600 వరకు, స్టార్స్ రూ.20, 30, 40 సైజుల ఆధారంగా విక్రయించారు. ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా బాణసంచా తీసుకువచ్చేందుకు హోల్‌సెల్ వ్యాపారులకు సైతం భారీగా రవాణా, ఇతర చార్జీలు పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణంగా రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు గతేడాదితో పోల్చుకుంటే అధికమని వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదల ప్రభావం ప్రత్యక్షంగా వినియోగదారులపై పడటంతో కొద్దిమొత్తంలో బాణసంచా కొనుగోలు చేసి వెళ్తున్నారు.

వెలిసిన దుకాణాలు

నోముల సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో తాత్కాలిక దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మట్టి ప్రమిదలు, నోము దండలు, మట్టి బొమ్మలు, బంతిపూలు, పూజాసామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయగా వారాంతపు సంత స్థలంలో బాంబుల దుకాణాలను ఏర్పాటు చేశారు. పండుగకు ముందు నుంచే పట్టి ప్రమిదలు, బొమ్మలు, బంతి పూలు బాణసంచాలు కొనుగోలు చేస్తున్నారు.

మీడియా గొంతు నొక్కడం
అప్రజాస్వామికం

సాక్షి దినపత్రికపై ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు సరికాదు

- తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలి
- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి మీడియా గొంతునొక్కడం అప్రజాస్వామికమని పలు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సాక్షి దినపత్రికపై దాడులు చేస్తూ, ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న సర్కారు వైఖరిని ఖండించాలని పిలుపునిచ్చారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని అన్నారు. - సాక్షి నెట్‌వర్క్

భావప్రకటన స్వేచ్ఛ అందరి హక్కు..



హన్మకొండ: పత్రికా స్వేచ్ఛను హరించొద్దు. భావ ప్రకటన స్వేచ్ఛ అందరి హక్కు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉండే పత్రికలపై కక్షపూరితంగా వ్యవహరించడం తగదు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం సాక్షి దినపత్రికపై కక్ష గట్టడం సరికాదు. ఎడిటర్, విలేకరులపై అకారణంగా, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం. వార్తలో లోపాలుంటే ఖండన ఇవ్వాలి. ఇలా కాకుండా నోటీసులు ఇచ్చి కేసులు పెట్టి వేధించడం అప్రజాస్వామికం.

- ఏదునూరి రాజమొగిలి, బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి

వేధింపులు మానుకోవాలి..



నెహ్రూసెంటర్: వాస్తవ కథనాలు ప్రచురించిన సాక్షి పత్రికపై, ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం, పోలీసులు వేధింపులు మానుకోవాలి. ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చెప్పినట్లు అక్కడి పోలీసులు వ్యవహరిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే చూస్తూ ఊరుకోం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. సాక్షి పత్రికపై దాడులు, పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

- గుగులోత్ భీమానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఏపీ ప్రభుత్వ వైఖరిని ఖండించాలి..



పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వార్తలు ప్రచురించినప్పుడు మనోభావాలు దెబ్బతిన్నాయని భావిస్తే న్యాయం పోరాటం చేయాలి. బెదిరింపులకు పాల్పడుతూ కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛ హరించడమే. ఏపీ ప్రభుత్వ వైఖరిని ముక్తకంఠంతో ఖండించాలి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- ఆడెపు రవీందర్, అధ్యక్షుడు దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం, వరంగల్

ఇబ్బందులకు గురిచేయడం సరికాదు..



వెంకటాపురం(కె): అధికారం ఉందనే అహంకారంతో జర్నలిస్టులు, మీడియా సంస్థను ఇబ్బందులకు గురిచేసేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సరికాదు. జర్నలిస్టుల గళాన్ని అణచివేసేలా వ్యవహరిస్తున్న చర్యలు తక్షణమే మానుకోవాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని సాక్షి జర్నలిస్టులు, ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సరికాదు.

- పర్శిక సతీశ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్

అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలి



నెహ్రూసెంటర్: సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు, నోటీసులను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. అక్రమ కేసులు పెట్టడాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. వాస్తవ కథనాల ద్వారా అక్రమాలను వెలికితీస్తే కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఏపీ ప్రభుత్వానికి లేదు. సాక్షిపై కేసులు, నోటీసులను వెనక్కి తీసుకోవాలి.

- గుగ్గిళ్ల పీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు..



స్టేషన్‌ఘన్‌పూర్: పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. సాక్షి మీడియాలో ఏపీ ప్రభుత్వం పోలీసులతో సోదాలు, దాడులు చేయిస్తూ పత్రికా స్వేచ్ఛను హరించడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన పత్రికారంగంపై దాడి అనాగరికం. సాక్షి మీడియాపై చంద్రబాబు ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదు.

- మంగు జయప్రకాశ్, టీఎస్ యూటీఎఫ్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు, స్టేషన్‌ఘన్‌పూర్

వెలుగుల వేడుక..



నేడు దీపావళి పర్వదినం

- వృక్షాకారంలో దీపాలు వెలిగిస్తే చాలా మంచిది..
- వ్యాపారులకు శ్రీమహాలక్ష్మీ పూజలు ప్రత్యేకం..
- నోములు జరుపుకోవడమే దివ్వెల అమావాస్య ప్రత్యేకం..

హన్మకొండ కల్చరల్: దీపం.. ప్రపంచానికి వెలుగులు పంచుతూ ప్రజల జీవితాల్లో కాంతిరేఖలు నింపే చైతన్య దీప్తి.. జ్ఞానజ్యోతి వెలిగించి కొత్త ఆశలను మోసుకొచ్చే ఆధ్యాత్మిక పండుగ దీపావళి. అజ్ఞానమనే చీకటి నుంచి విజ్ఞానమనే వెలుగులోకి పయనించి జీవిత పరమార్థాన్ని తెలియజేసే పర్వదినం దీపావళి. ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులను తీసుకొచ్చే గొప్ప పండుగ. అశ్వయుజ బహుళ అమావాస్య రోజున ఈ పండుగను జరుపుకోనున్నారు. ఈ క్రమంలో నగర ప్రజలు నేడు (సోమవారం) ఉదయం చతుర్థి మంగళ హారతులు, సాయంత్రం లక్ష్మీపూజలు, మంగళవారం నోములు నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు.

పక్షం రోజుల ముందుగానే ఇల్లు శుభ్రం..

దీపావళి పండుగకు పక్షం రోజుల ముందుగానే ఇంటిని శుభ్రం చేస్తారు. దీపావళి ముందు వచ్చే ఆది, గురువారాల్లో వాకిలిదేవర పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. వాకిలిదేవర పండుగతో ఇంటికి సంబంధించిన కీడు తొలగిపోతుందని విశ్వాసం. ఆ తర్వాత ఇంటిగోడలకు సున్నాలు వేసి అలంకరించి శుభ్రపరుచుకుంటారు. గోడలకు ముగ్గులు వేస్తారు.

దీపావళిరోజు చేసే పనులు..

భోగిరోజుమాదిరిగానే మంగళస్నానాలు చేస్తారు. ఇంటిధర్వాజలకు మామిడి ఆకు తోరణాలు కట్టి బంతిపూల దండలతో అలంకరిస్తారు. సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. దుకాణదారులు లక్ష్మీ పూజలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. అందరూ లక్ష్మీదేవిని పూజించడం సాధ్యంకాదు. అందుకే దీపలక్ష్మిని ఇంటిముందు గూళ్లలో వెలిగించడం సంప్రదాయంగా అలవర్చుకున్నారు.

మంగళహారతులు..

దీపావళి రోజు నువ్వుల నూనెతో మర్ధన చేసుకుని ఉత్తరేణి, తుమ్మి, తగిరస చెట్ల కొమ్మలను నీళ్లలో వేసి ఆ నీళ్లను మరిగించి ఆ నీటిని కలియబెట్టి స్నానం చేస్తారు. అనంతరం నూతన దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలు ఇంటి యజమానులకు మంగళహారతులు పడతారు. ఇంటియజమాని వారికి కట్నాలు చదివించి సంతోషం కలిగిస్తాడు.

అమ్మకాలతో కిక్కిరిసిన రహదారులు..

దీపావళిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ప్రధాన కూడళ్లలో సందడి నెలకొంది. మట్టి, పింగాణీ ప్రమిదలు, బాణాసంచా విక్రయాలతో నగరంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. హంటర్‌రోడ్, బట్టల బజార్ ప్రాంతాల్లో వెలసిన బాణసంచా దుకాణాల్లో జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దీంతో పాటు కేదారేశ్వరవ్రతంలో ఉపయోగించే పట్టు దారాలు, మర్రిఊడలు, కొత్త చాటలు, ఊదు, బంతిపూలు, లక్ష్మీదేవిగా ప్రియమైన పద్మములు తదితర నోము సామగ్రి అమ్మకాలు జోరుగా జరిగాయి.




నగరంలో ప్రమిదలు, బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

పర్యావరణహిత 'దీపావళి'ని ఆహ్వానించాలి



దీపావళి పండుగలో చిచ్చుబుడ్డి వెలుగులు

మహబూబాబాద్ రూరల్: చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా జరుపుకునే పండుగ దీపావళి. ఈ పండుగ పరామర్థం మానవ జీవితంలో ఆనందాలను నింపడమే.. అందుకే ఈ రోజున బాణసంచా పేల్చుతాం. అయితే దీపావళి వేడుకలను శబ్దకాలుష్యం లేకుండా దీపోత్సవంగా జరుపుకోవాలి. బాణసంచా కాల్చడం వల్ల బీపీ, తలనొప్పి, గుండెపోటు తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని చెప్పొచ్చు. కాలుష్య పొగను పీల్చితే ముక్కు, గొంతులో మంటలు ఏర్పడుతాయి. బాణసంచా పొగ కళ్లను మండించి నీరు తెప్పించడమేకాకుండా ఎరుపు రంగులోకి మారుస్తాయి. చెవులు ఒక్కోసారి పనిచేయడం మానేస్తాయి. అంతేకాకుండా చెవుడుకూడా వచ్చేప్రమాదం ఉంది. బాణసంచా కాలిస్తే అధిక రక్తపోటు, ఊపిరితిత్తుల వ్యాధులు, దగ్గు, తుమ్ములు, అస్తమా, ఉబ్బసం, అధికమవుతాయి. శ్వాస కష్టమవుతుంది. విష వాయువులు గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మానసికంగా సరిలేని వారు కూడా ఈ పండుగ రోజుల్లో భయం, ఒత్తిడికి గురవుతారు. భారీ ధ్వని కాలుష్యానికి వయసు పైబడిన వారు మరింత బాధపడుతారు. అందుకే ప్రతీ ఒక్కరూ పర్యావరణహిత 'దీపావళి'ని జరుపుకోవాలని ఆశిద్దాం.

ఇంటిలోని ఏమూలలోనూ చీకటి లేకుండా చూడాలి..



ఈ రోజు దీపతోరణాలు వెలిగించే ఆచారం ఉంది. అందుకే దీపావళి పండుగగా పిలుస్తారు. ఈరోజున శ్రీమహా లక్ష్మీదేవి భూలోకానికి వచ్చి ఇంటింటికీ తిరుగుతుందని భావిస్తారు. అందుకే ప్రజలు శ్రీమహాలక్ష్మీదేవికి నీరాజనాలు పలుకుతూ తమ ఇంటిలోపల, వెలుపల దీపాలు వెలిగిస్తారు. ఈ రోజు మట్టి ప్రమిదలో నెయ్యి లేదా నూనె పోసి, ఒత్తులు వేసి దీపాలు వెలిగించడం సర్వశ్రేష్టం. దీపాల వరుసను వృక్షాకారంలో, స్వస్తిక్ ఆకారంలోనూ పేర్చి వెలిగిస్తే మరింత మంచిది. పురాతన శివాలయాలలో దీపదానం చేయడం దేవాలయాల్లో దీపాలు వెలిగించడం సంప్రదాయం. ఇంటిలోని ఏ మూలలోనూ చీకటి లేకుండా చూడాలి.

సీతంపేటలో 'దీపావళి' బతుకమ్మ

- రేపటి నుంచి వేడుకలు ప్రారంభం
- మూడు రోజులపాటు సంబురాలు

హసన్‌పర్తి: తెలంగాణ వ్యాప్తంగా దసరా ఉత్సవాలను పురస్కరించుకుని బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తే.. సీతంపేటలో మాత్రం దీపావళి సందర్భంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ గ్రామానికి చెందిన నేతకాని కులస్తులకు మాత్రమే ఈ వేడుకలు ప్రత్యేకం. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. రెండు వందల ఏళ్ల నుంచి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నేతకాని కులస్తులు పేర్కొన్నారు. గతంలో ఐదు రోజులపాటు కొనసాగిన ఈ ఉత్సవాలను మూడు రోజులకు కుదించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కులస్తులు ప్రతీ దీపావళికి సీతంపేటకు వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు. కోలాటాల మధ్య ఉత్సవాలు కొనసాగనున్నాయి.

తొలిరోజు దేవతామూర్తుల ప్రతిమలు..

దీపావళి బతుకమ్మ వేడుక సందర్భంగా తొలి రోజు మంగళవారం చెరువు నుంచి మట్టిని తీసుకొచ్చి దేవతల ప్రతిమలను (ఎద్దులు) తయారు చేస్తారు. ఆ ప్రతిమలను ప్రత్యేక గదిలో ప్రతిష్ఠించి నైవేద్యాలు సమర్పిస్తారు. అనంతరం విశేష పూజలు నిర్వహిస్తారు.

రెండో రోజు పురుషుల ఉపవాస దీక్షలు



బతుకమ్మ ఆడుతున్న నేతకాని మహిళలు(ఫైల్)

రెండో రోజు బుధవారం పురుషులు ఉపవాస దీక్ష చేపడుతారు.అనంతరం సాయంత్రం ఇళ్లల్లో ప్రతిష్ఠించిన దేవతామూర్తుల ప్రతిమలను భారీ ప్రదర్శనగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం చెరువు వద్ద ఉపవాస దీక్ష విరమిస్తారు. ఆతర్వాత చెరువు నుంచి జలం తీసుకొచ్చి ప్రత్యేక గదిలో పెట్టి పూజలు చేస్తారు.

చివరి రోజుల బతుకమ్మ వేడుకలు

మూడో రోజు గురువారం మహిళలు గౌరమ్మ(బతుకమ్మ)లను తయారుచేసి భారీ ప్రదర్శనగా బయలుదేరుతారు. మహిళలతో పాటు పురుషులు కూడా బతుకమ్మలు ఎత్తుకుని ముందుకు సాగడం ప్రత్యేకత.

పోలీసుల అదుపులో అనుమానితుడు

వరంగల్: పైడిపల్లి గ్రామ శివారులో అనుమానాస్పదంగా వెళ్తున్న కారు నుంచి ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆదివారం ఆ కారును అపహరించి అందులో ముగ్గురు పారిపోతున్న విషయం పోలీసులకు సమాచారం అందడంతో వెంబడించినట్లు సమాచారం. పైడిపల్లి శివారులో కారును అడ్డగించగా అందులోని ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోవడంతో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రశ్నించగా ఇటీవల జరిగిన చోరీలతో సంబంధం ఉన్నట్లు బయటపడినట్లు తెలిసింది. దీంతో కారుతో పాటు అనుమానితుడిని ఏనుమాముల పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈవిషయంపై పోలీసులను వివరణ కోరగా పూర్తి సమాచారం తర్వాత వెల్లడిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో బీఆర్ఎస్ నాయకుడి మృతి



రాజు(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ల్యాదేళ్ల రాజు(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం అతడి మృతదేహం ఇదే డివిజన్‌లోని మొగిలిచర్ల శివారులో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి బంధువులు, గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ కథనం ప్రకారం.. గోనె సంచుల వ్యాపారం చేస్తున్న రాజు శనివారం మధ్యాహ్నం హసన్‌పర్తి పీఎస్‌లో పని ఉందంటూ ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. మరుసటి రోజు అతడి మృతదేహం మొగిలిచర్ల శివారులోని శ్మశానవాటిక సమీపంలో లభ్యమైంది. తన భర్త అనుమానాస్పదంగా మృతి చెందాడని మృతుడి భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తోపాటు మృతుడి సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా, ఘటనాస్థలిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రాజు అంత్యక్రియలకు రూ. 50వేలు అందజేశారు.

తల్లుల పోరాటం అందరికీ స్ఫూర్తి

- దత్తగిరి పీఠాధిపతులు అవధూతగిరి, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ పోరాటం అందరికీ స్ఫూర్తి అని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. ఆదివారం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతులు దేశ ప్రజల సుఖశాంతుల కోసం వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ ధర్మం, ధైర్యం, త్యాగం నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం జాతర ఉత్సవాల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు అభినందనీయమన్నారు. సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు తమ జీవితాన్ని ధర్మమార్గంలో నడిపితే సమాజంలో శాంతి, సౌభ్రాతత్వం నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, పూజారులు సిద్ధబోయిన మునీందర్, జూనియర్ అసిస్టెంట్లు మధు, జగదీశ్వర్ పాల్గొన్నారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న పీఠాధిపతులు

గోదావరిలో యువకుడి గల్లంతు



పాషా(ఫైల్)

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గ్రామానికి చెందిన ఓ యువకుడు గోదావరి నదిలో గల్లంతయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాషా గోదావరి లంకల్లో పుచ్చతోట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పుచ్చతోటను చూసి వచ్చేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గోదావరిలోని నీటి మడుగును దాటేక్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి లోతుకు వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో పాషా కోసం గ్రామస్తులు నాటు పడవల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్


- రూ. 3,68,530 నగదు స్వాధీనం

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పీఎస్ పరిధిలోని కొత్తవాడలో దోనెపూడి రమేశ్ బాబు అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్ ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3,68,530 నగదు తోపాటు ప్లెయింగ్ కార్డులు, నాణెలతో ఆడుతున్న టోకెన్లు, 15 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడి అనంతరం పట్టుబడిన వారిని, సీజ్ చేసిన వస్తువులను మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో గుదురు హరిబాబు, వెలుపడను సదానందం, మాడిశెట్టి శివశంకర్, నోముల తిరుపతిరెడ్డి, రావర్ల శ్రీనివాసరావు, నీలం రాజ్‌కిశోర్, పరిశాల నాగరాజు, బస్వరాజు కుమారస్వామి, చింతం సంతోష్, జావీద్, పుట్ట మోహన్‌రెడ్డి, మేరు వీరేశం ఉన్నారు.

గ్రామస్థాయి నుంచి బీసీ ఉద్యమం బలోపేతం

- టీఎస్ బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్

హన్మకొండ : బీసీ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. ఆదివారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంద్ ఫర్ జస్టిస్ విజయవంతానికి కృషి చేసిన, సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ బంద్ తెలంగాణ ఉద్యమం తరహాలో జరిగిందని, ఈ బంద్ బీసీ ఉద్యమానికి ఆరంభం మాత్రమేనన్నారు. బీసీ ఉద్యమాన్ని గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లి బీసీలను చైతన్య పరుస్తామన్నారు. ఓటు మనదే.. సీటు మనదే.. రాజ్యాధికారం మనదే అనే నినాదంతో బీసీలందరినీ సంఘటితం చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు బీసీ జేఏసీ కృషి చేస్తోందన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ చైర్మన్ దొడ్డపెల్లి రఘుపతి, వైస్ చైర్మన్లు దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మల శోభారాణి, కోఆర్డినేటర్లు గాజు యుగంధర్ యాదవ్, తంగళ్లపల్లి రమేశ్, ప్రచార కార్యదర్శి అరేగంటి నాగరాజు గౌడ్, చాగంటి రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్ గౌడ్

కానిస్టేబుల్ శ్రమ వృథా..

- గంటలోనే దూరమైన సంతోషం
- బైక్ పైనుంచి పడిన వ్యక్తి మృతి

దంతాలపల్లి : ఓ వ్యక్తిని గంటపాటు కష్టపడి సీపీఆర్ చేసి బతికించిన కానిస్టేబుల్ శ్రమ వృథా అయ్యింది. బతికాడనుకున్న వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. దీంతో గంటలోనే ఆ సంతోషం దూరమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన తల్లాడి లక్ష్మయ్య, నాగమ్మ దంపతుల కుమారుడు ఉమేశ్ (42) పని నిమిత్తం బైక్‌పై ఆదివారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం జి కొత్తపల్లి గ్రామానికి వెళ్తున్నాడు.ఈ క్రమంలో మండలంలోని దాట్ల గ్రామ సమీపాన బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఇదే సమయంలో దంతాలపల్లి పీఎస్ కానిస్టేబుల్ కొయేడి శ్రీను ఓ కేసు విషయంలో దాట్లకు వచ్చాడు. ఈ క్రమంలో ఉమేశ్ బైక్ నుంచి పడ్డాడనే విషయం తెలిసింది. దీంతో వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ఉమేశ్‌ను గంటపాటు కష్టపడి సీపీఆర్ చేసి బతికించాడు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా ఉమేశ్ మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ఉమేశ్ (ఫైల్)